క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న రామకృష్ణారావు

హుస్నాబాద్: పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయాన్ని సోమవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.రామకృష్ణారావు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో కొత్తగా రూ.50లక్షలతో నిర్మిస్తున్న మండప నిర్మాణం పనులు, ఆలయ సంప్రదాయాలపై ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆలయ అభివృద్ధిపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉప కమిషనర్ రామకృష్ణారావును ఆలయ నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో విశ్వనాథశర్మ, అర్చకులు పరమేశ్వర్, సిబ్బంది కుమారస్వామి, వీర శంకరయ్య, హన్మంత్, రమేశ్‌లు ఉన్నారు.

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌కు అభినందన



ఆంజనేయగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పర్వతాలు

చేర్యాల(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్‌గా నియమితులైన ఈడిగ ఆంజనేయగౌడ్‌ను సోమవారం ఎల్బీ స్టేడియంలో మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జింకల పర్వతాలుయాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట బీఆర్‌ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజుయాదవ్, పీఆర్‌టీ ఆలేటి రమేశ్ ఉన్నారు.

పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడికి..



తిరుపతిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ రమణ

దుబ్బాకటౌన్: పద్మశాలి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన దుబ్బాక పట్టణానికి చెందిన గాజుల తిరుపతిని ఎమ్మెల్సీ ఎల్.రమణ అభినందించారు. ఈ సందర్భంగా భవిష్యత్‌లో మరింతగా ఉన్నతస్థాయి పదవులు పొందాలని ఆకాంక్షించారు.

ఆస్పత్రి నిర్మాణాన్ని నిలిపివేయాలి

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని విజయ పాలశీతల కేంద్రం ఆవరణలో చేపడుతున్న ఆస్పత్రి నిర్మాణాన్ని ఆపేయాలని జేఏసీ చైర్మన్ భైరవబట్ల చక్రధర్ డిమాండ్ చేశాడు. సోమవారం విజయ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు అంజిరెడ్డితో కలిసి స్థలాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. 12 ఏళ్ల క్రితం ప్రభుత్వం విజయ డెయిరీ కోసం 2.5 ఎకరాల స్థలం కేటాయించి నిర్మాణం చేసిందన్నారు. నాటి నుంచి నేటివరకు రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచిన ఈ డెయిరీ సుమారు 64 గ్రామాల రైతులతో రోజుకు 10వేల లీటర్ల పాలు ఉత్పత్తి చేస్తుందన్నారు. పశువులకు కేటాయించిన పశుగ్రాసం స్థలంలో ఆస్పత్రి నిర్మాణం చేయడం సబబు కాదన్నారు. ఆస్పత్రి నిర్మాణంపై మంత్రి హరీశ్‌రావు, స్థానిక ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పునఃరాలోచించాలని కోరారు. పాల ఉత్పత్తిదారులకు న్యాయం చేయని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరన్న, నాయకులు వంశీరెడ్డి, పుల్లని వేణు, రైతులున్నారు.

వేడుకగా గోదారంగనాథ స్వామి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

నంగునూరు(సిద్దిపేట): ధనుర్మాసం పరమ పవిత్రమాసమని కల్యాణంలో పాల్గొన్న వారికి సకల శుభాలు కలుగుతాయని వైదికులు డింగరి రంగాచార్యులు, దాడూరి చరణ్‌చార్యులు భక్తులకు ఉపదేశించారు. పాలమాకులలోని వేంకటేశ్వరాలయంలో సోమవారం గోదా రంగనాథస్వామి కల్యాణం కనుల పండువగా జరిగింది. స్వామివారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వెంకటేశ్వరాలయ దాతృత్వ సంస్థ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి విష్ణు తేజాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు'

- రెండో విడత కార్యక్రమ ఏర్పాట్లపై సమావేశం
- వైద్యాధికారులతో మున్సిపల్ చైర్మన్లు, సిబ్బంది చర్చ



గజ్వేల్‌రూరల్: ఏర్పాట్లపై చర్చిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, తదితరులు

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 18వ తేదీన ప్రారంభం కానున్న 2వ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపరాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వైద్య అధికారులు, కౌన్సిలర్లతో కంటి వెలుగు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజేంద్రకుమార్‌తో కలసి మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

హుస్నాబాద్: మున్సిపల్ సమావేశ మందిరంలో సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ.. ప్రతీ రోజు రెండు వార్డుల్లో 200 నుంచి 300 మందికి తెలంగాణ ప్రభుత్వం కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు ఉచితంగా ఇవ్వబడుతుందని తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ రజిత సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సౌమ్య, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



చేర్యాల: మాట్లాడుతున్న చైర్‌పర్సన్ స్వరూపరాణి

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ విద్యాధర్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయరాణి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్‌లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజమౌళి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతీ వార్డులో కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వైద్య సిబ్బంది, కౌన్సిలర్లు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఈ సందర్భంగా కంటివెలుగు కార్యక్రమ విజయవంతానికి చేపట్టాల్సిన అంశాలపై వైద్య సిబ్బంది, కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె రోడ్లకు మహర్దశ

మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేటరూరల్: సిద్దిపేట నియోజకవర్గం నారాయణరావుపేట మండలంలోని గ్రామాలకు బీటీరోడ్ల నిర్మాణానికి రూ.14 కోట్ల 55 లక్షల నిధులు మంజూరైనట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..మండలంలోని గోపులాపూర్ గ్రామం నుంచి నారాయణరావుపేటకు 4 కిలోమీటర్ల బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల 99లక్షలు, అదేవిధంగా మాటిండ్ల నుంచి జిల్లెల వరకు 2 కిలోమీటర్లన్నర బీటీరోడ్డు నిర్మాణానికి రూ.3 కోట్ల 73లక్షల, మల్యాల గ్రామం నుంచి నారాయణరావుపేట మండల కేంద్రం వరకు 4 కిలోమీటర్లన్నర రోడ్డుకు 4కోట్ల 27లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు మంత్రి చెప్పారు. అదేవిధంగా గుర్రాలగొంది గ్రామంలోని లక్ష్మినరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారికి కిలోమీటర్ బీటీరోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి 5లక్షలు, బంజేరుపల్లి నుంచి బుగ్గరాజేశ్వరస్వామి ఆలయం వరకు కిలోమీటరున్నర రోడ్డు నిర్మాణానికి రూ.1 కోటి 50లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. ఈ బీటీరోడ్ల నిర్మాణంతో రైతులకు, ప్రజల ప్రయాణానికి సులభతరం కానుందన్నారు. త్వరితగతిన టెండర్ ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపట్టి అందుబాటులోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు



హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ కిరణ్

హుస్నాబాద్: జనవరి 12 స్వామి వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో నేటి నుంచి క్రీడోత్సవాలు నిర్వహించనున్నట్లు సీఐ కిరణ్ తెలిపారు. సోమవారం వ్యాయామ ఉపాధ్యాయులతో కలసి క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ కిరణ్ మాట్లాడుతూ.. మంగళవారం, బుధవారం రెండు రోజులు జిల్లాస్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాలకు చెందిన ఆసక్తి గల క్రీడాకారులు హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై శ్రీధర్‌ను సంప్రదించాలన్నారు. ఈ పోటీలను సీపీ శ్వేత ప్రారంభించనున్నట్లు తెలిపారు. గెలిచిన జట్టుకు సీపీ చేతుల మీదుగా సిద్దిపేటలో బహుమతి ప్రదానం చేస్తారని సీఐ కిరణ్ వెల్లడించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు జంగపల్లి వెంకటనర్సయ్య, సత్యనారాయణరెడ్డి, వెంకటస్వామి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ఆదర్శం

పాలకవర్గ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత

సిద్దిపేటజోన్: త్వరలో సిద్దిపేట ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డ్‌కు అంతర్జాతీయ గుర్తింపు రానుందని, మంత్రి హరీశ్‌రావు ఆలోచనలకు అనుగుణంగా మార్కెట్ యార్డ్ స్వచ్ఛతలో మెరుగైన ఫలితాలు సాధించనుందని సిద్దిపేట మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజితవేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం పత్తి మార్కెట్ ఏఎంసీ సమావేశ మందిరంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు కృషితో త్వరలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎస్ఏఐ) గుర్తింపు రానుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాలకవర్గ సభ్యుల పక్షాన మంత్రికి ముందస్తు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటీవల కేంద్ర బృందం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను సందర్శించి, పరిశుభ్రత, స్వచ్ఛత, మౌలిక వసతుల కల్పన, తదితర అంశాలపై సంతృప్తి వ్యక్తం చేసిందని పేర్కొన్నారు. అనంతరం సిద్దిపేట మార్కెట్ యార్డ్‌లో కొనుగోలు ప్రక్రియ, ఇతర అంశాలపై చర్చించారు. ధాన్యం కొనుగోలు విషయంలో సిద్దిపేట మార్కెట్ ఆదర్శంగా నిలిచిందని, మూడురోజుల్లో రైతులకు కొనుగోలు డబ్బులు ఇచ్చామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్‌కు బకాయి ఉన్న 64 లక్షల పన్నులను విజిత, మున్సిపల్ అధికారులు శ్రీకాంత్, బాలకృష్ణలకు చెక్కు రూపంలో అందించారు. సమావేశంలో వైస్ చైర్మన్ రాంచందర్‌రావు, మార్కెట్ సెక్రటరీ వెంకటయ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజిత

సమస్యలు సత్వరం పరిష్కరించాలి

మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న మున్సిపల్ కమిషనర్

సిద్దిపేటజోన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను కమిషనర్ స్వీకరించారు. మొదటి ప్రాధాన్యత కింద సమస్యలు గుర్తించి తక్షణమే వాటిని పరిష్కరించాలని సూచించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ సంబంధించి అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు మహేశ్, అన్వేష్, రంజిత్, యాదగిరి, సతీశ్, వనిత, దేవరాజ్, కిష్టయ్య పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించండి

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాల జెడ్పీహెచ్ఎస్‌లో గతంలో ఉన్న పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని పునరుద్ధరించాలని విద్యార్థులు వేడుకున్నారు. సోమవారం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థినీ, విద్యార్థులు పరీక్షా కేంద్రాన్ని పునరుద్ధరించాలని జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులను వేడుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. పరీక్ష కేంద్రాన్ని ఎత్తివేయడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. పేద కుటుంబాలకు చెందిన తాము పరీక్షల నిమిత్తం దూర ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉందని, పాఠశాల ఆవరణ నుంచి కలెక్టర్‌కు దండం పెట్టి వేడుకుంటున్నామన్నారు. కార్యక్రమానికి ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి బంగారు ప్రేమ్‌కుమార్, మండల ఉపాధ్యక్షులు సుంచు సంజయ్ మద్దతు తెలిపారు.

ఆయిల్‌పామ్‌తో రైతులకు మేలు

సిద్దిపేటరూరల్: రైతులు సాంప్రదాయ పంటలు కాకుండా ఆయిల్‌పామ్ సాగు చేయడంతో ఎంతో మేలు కలుగుతుందని ఏపీఓ స్రవంతి అన్నారు. సోమవారం నారాయణరావుపేట మండల పరిధిలో గల మాటిండ్ల గ్రామంలోని పలువురు రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ సాగును సర్పంచ్ నారాయణతో కలిసి ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణతతో ఆదర్శంగా నిలవాలి



సందేశ పత్రాలను చూపుతున్న అధికారులు

సిద్దిపేటరూరల్: విద్యార్థులు బాగా చదువుకొని వందశాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాలను జిల్లాలో ప్రథమ స్థానంలో నిలపాలని మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్ సూచించారు. మండల పరిధిలోని ఇర్కోడ్ ఆదర్శ పాఠశాలలో మంత్రి హరీశ్‌రావు పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులను ఉద్దేశించి సూచించిన పత్రాలను ఆయన విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మండల రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులను ఎప్పుడు ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని, ఇష్టంతో అభ్యసిస్తే చాలా మంచి ఫలితాలు పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సమ్మిరెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాదారి నాగరాజు, పాఠశాల ఉపాధ్యాయులు సతీష్ కుమార్, బుచ్చిబాబు, ముకేశ్ అశ్విని, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

సాదాసీదాగా దౌల్తాబాద్ మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సంధ్య

దుబ్బాక: ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతీ 3 నెలలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సోమవారం దౌల్తాబాద్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గంగాధరి సంధ్య అధ్యక్షత సాదాసీదాగా కొనసాగింది. ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం ప్రజాప్రతినిధుల, అధికారుల జాప్యంతో 3 గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా అధికారులు మండలంలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని, భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యాచరణ గురించి ప్రజాప్రతినిధులతో చర్చించారు. ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న కంటి వెలుగు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, ప్రజలు తప్పక సహకరించాలని వైద్యాధికారులు కోరారు. సభ మధ్యలోనే ప్రజాప్రతినిధులు, అధికారులు సమయపాలన పాటించకపోగా, సభ మధ్యలో నుంచే వెళ్లిపోవడం బాధాకరమని తిరుమలాపూర్ ఎంపీటీసీ బండారు దేవేందర్ ప్రశ్నించగా, దుబ్బాకలో కంటి వెలుగు అవగాహన సమావేశం ఉందని ఎంపీపీ సంధ్య సమాధానమిచ్చారు. మండలంలో కరెంట్ స్తంభాల సమస్య తప్ప సమావేశంలో ప్రజాప్రతినిధులు ఏ సమస్యలను లేవనెత్తలేదు. దీంతో ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన అధికారులు మౌనం వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్, వైస్ ఎంపీపీ శేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో కేంద్రం విఫలం

గజ్వేల్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేస్తుండగా, రాష్ట్రంలో కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం వరుస ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేశారని గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. సోమవారం గజ్వేల్‌లోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏటా కోటి ఉద్యోగావకాశాలను కల్పిస్తామని మాట ఇచ్చి గద్దెనెక్కాడని మండిపడ్డారు. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరించడంతో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ యువత తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. మోదీ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో నిరుద్యోగం పెచ్చరిల్లుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీకి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా దేశంలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వరుస నోటిఫికేషన్లు వేయడం బీజేపీ నేతలకు మింగుడు పడటం లేదన్నారు.

సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం

మర్కూక్ సమావేశంలో సభ్యుల మండిపాటు



మాట్లాడుతున్న ఎంపీపీ పాండుగౌడ్

మర్కూక్(గజ్వేల్): ఇంటి విద్యుత్ మీటర్ బిల్లు ఎక్కువగా వస్తుందని, నూతన విద్యుత్ మీటర్ అమర్చాలని సంబంధిత అధికారులకు చెబితే 1500 రూపాయలు లంచం తీసుకున్నారని ఎంపీటీసీ చైతన్యరెడ్డి మండిపడ్డారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీపీ పాండుగౌడ్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలు సంబంధిత అధికారులు హాజరై తమ తమ నివేదికలను సమర్పించారు. విద్యుత్ అధికారి సుధాకర్‌రెడ్డి తమ నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా మర్కూక్ ఎంపీటీసీ చైతన్యరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ అధికారులు చిన్న చిన్న సమస్యలకు డబ్బులు అడుగుతున్నారని, స్వయంగా తానే నూతన విద్యుత్ మీటర్ అమర్చడానికి ఓ అధికారి 1500 రూపాయలు లంచం తీసుకున్నాడని సభ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ మండల అధికారి ఎందుకు ఈ సమావేశానికి హాజరు కాలేదని మండిపడ్డారు. రైతుల పొలాల వద్ద విద్యుత్ తీగలు కిందకు వేలాడుతున్నాయని, ఎన్నిసార్లు సంబంధిత అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సంబంధిత అధికారులు, ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ప్రతి మూడునెలల కొకసారి నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు తమతమ కింది స్థాయి అధికారులను పంపిస్తున్నారని ఎంపీటీసీలు మండిపడ్డారు. అనంతరం ఎంపీపీ పాండుగౌడ్ మాట్లాడుతూ.. అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత ప్రజా ప్రతినిధులను సమన్వయ పరుచుకుంటూ పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రంయాదవ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, తహసీల్దార్ భాగ్యరేఖ, ఎంపీడీఓ ప్రవీన్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు కృష్ణయాదవ్, ఎంపీటీసీలు ధనలక్ష్మి, గోలి నరేందర్, సర్పంచ్‌లు భాస్కర్, నర్సింలు, గాయత్రి, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీల ఎన్నిక



మాలపల్లిలో యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మండల అధ్యక్షుడు చందు

హుస్నాబాద్‌రూరల్: మండలంలో సోమవారం వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సమావేశాలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మండల అధ్యక్షుడు చందు అన్నారు. గ్రామ కార్యకర్తల సమక్షంలో నూతన కమిటీ అధ్యక్షులను ఎన్నికున్నారు. భల్లునాయక్ తండా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బికన్, మాలపల్లి అధ్యక్షుడిగా బత్తుల మల్లికార్జున్, కూచనపెల్లి అధ్యక్షుడిగా మామిడి రాజు, ఉమ్మాపూర్ అధ్యక్షుడిగా బెజ్జంకి బాబు, పొట్లపల్లి గ్రామ అధ్యక్షుడిగా కర్ర రవీందర్, మీర్జాపూర్ గ్రామ అధ్యక్షుడిగా వేల్పుల సంపత్, బంజేరుపల్లి గ్రామ అధ్యక్షుడిగా రిక్కల రాజిరెడ్డిలను ఎన్నుకున్నారు. ఈ సమావేశాల్లో కాంగ్రెస్ నాయకులు వెన్న రాజు,బత్తుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రావడం ఖాయం

కోహెడరూరల్(హుస్నాబాద్): వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య అన్నారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులతో సమావేశాలు నిర్వహించి గ్రామా కమిటీలను ఎన్నుకున్నారు. రామచంద్రాపూర్ గ్రామ అధ్యక్షుడిగా బొబ్బల కనుకరెడ్డి, వరికోల్ గ్రామ అధ్యక్షుడిగా శనిగరం తిరుపతి, వింజపల్లి గ్రామ అధ్యక్షుడిగా బద్దం రాజిరెడ్డి, నారాయణపూర్ గ్రామ అధ్యక్షుడిగా మిట్టపల్లి జనార్దన్‌చారిలను నియమించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్, సీనియర్ నాయకులు బందెల బాలకిషన్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింతకింది శంకర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ బాధిత కుటుంబానికి చేయూత

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుండారం గ్రామానికి చెందిన గోపగాని శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం ఫార్మర్స్ ఫస్ట్ ఫౌండేషన్ చైర్మన్ చక్రధర్‌గౌడ్ పరామర్శించి, మృతుడి భార్య అరుణకు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు.

◆ నేడు మంత్రి హరీశ్‌రావు పర్యటన

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల, దూల్మిట్ట మండలాల్లో మంగళవారం ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పర్యటించనున్నట్లు చేర్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ స్వరూపరాణి, బీఆర్‌ఎస్ పార్టీ దూల్మిట్ట మండల అధ్యక్షుడు మంద యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొంటారన్నారు. ఆయా కార్యక్రమాలకు కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

◆ రోడ్డు విస్తరణ పనుల పరిశీలన

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి మండల కేంద్రంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను సోమవారం బెజ్జంకి ఎంపీపీ లింగాల నిర్మల పరిశీలించారు. ప్రజల సౌకర్యం కోసం చేపట్టే రోడ్డు వెడల్పు కార్యక్రమానికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాము, ఎస్ఐ నరేష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కచ్చు రాజయ్య, సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

◆ 11న ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

చేర్యాల(సిద్దిపేట): ఈ నెల 11వ తేదీన పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు తెలిపారు. సోమవారం వేణు మాట్లాడుతూ.. ఈ నెల 11న నిర్వహించే క్రీడా పోటీల్లో కబడ్డీ, వాలీబాల్ పురుషులకు, ముగ్గుల పోటీలు మహిళలకు ఉంటాయన్నారు. ఎలాంటి ప్రవేశ రుసుము లేదని, జిల్లా వ్యాప్తంగా చదువుకుంటున్న విద్యార్థినీ, విద్యార్థులకు పాల్గొనే అవకాశం కలదన్నారు. టీం నమోదు కోసం 8688818914ను సంప్రదించాలన్నారు.

◆ తహసీల్దార్‌కు సన్మానం

మర్కూక్(గజ్వేల్): మర్కూక్ నూతన తహసీల్దార్‌గా రెండురోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన భాగ్యరేఖను మర్కూక్ మండల బీఆర్‌ఎస్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు, సేవా రత్న అవార్డు గ్రహీత మేకల కనకయ్య సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ యువత క్రీడల్లో రాణించాలి

హుస్నాబాద్‌రూరల్: యువత క్రీడల్లో రాణిస్తే శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ఎస్సై శ్రీధర్ అన్నారు. సోమవారం గాంధీనగర్‌లో నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ దుండ్ర భారతి, కార్యదర్శి హారిక, క్రీడాకారులు పాల్గొన్నారు.

◆ అక్కన్నపేట పీహెచ్‌సీ వైద్యాధికారిగా శ్రీకాంత్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) వైద్యాధికారిగా డాక్టర్.శ్రీకాంత్ యాదవ్ సోమవారం పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్.శ్రీకాంత్ మాట్లాడుతూ.. పేదప్రజల కోసం పనిచేస్తానని, ఆస్పత్రిల్లో 24గంటలు అందుబాటులో ఉంటానన్నారు.

◆ ఎస్సీ హాస్టల్ సందర్శన

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని ఎస్సీ హాస్టల్‌ను ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం సందర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ ఆధ్వర్యంలో హాస్టల్‌లో వసతులను పరిశీలించారు. భోజన తీరులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ పరశురాంలు, ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన ముగ్గుల పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణారెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని సిద్దిపేటలోని శరభేశ్వరాలయంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా పట్టణంలోని మహిళలు వేసిన రంగవల్లులు అలరించాయి. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి, డాక్టర్ రమాదేవి, బీజేపీ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్‌రావు, రాష్ట్ర సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమలరెడ్డి, మహిళామోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ బొమ్మగాని పద్మగౌడ్, తోట స్వరూప, వైస్ ప్రెసిడెంట్ లక్ష్మి, బండి సుగుణ, భవాని తదితరులు పాల్గొని ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

నంగునూరు(సిద్దిపేట): విద్యార్థులకు మన పండగల విశిష్టత, సంస్కృతీ సంప్రదాయాలు నేర్పించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి వాసర యాదమల్లు అన్నారు. సోమవారం మగ్దుంపూర్ ఉన్నత పాఠశాలలో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగేందర్‌రెడ్డి, వైద్యాధికారి సాయికృష్ణ, బీజేపీ నాయకులు జ్యోతిరెడ్డి, రాజలింగం, ఉపాధ్యాయులు కత్తుల లక్ష్మారెడ్డి, సమ్మయ్య, రాజ్యలక్ష్మి, దరిపల్లి ఎల్లం, రమేశ్, మంజుల, రాజు తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు